## క్లుప్తంగా

### న్యాయవాదుల విధుల బహిష్కరణ


విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**లక్సెట్టిపేట:** హైదరాబాద్‌లో న్యాయవాది సంతోష్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నా, ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పోలీసుల బెదిరింపులు, దాడుల వల్ల న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. ప్రభుత్వం పట్టించుకొని కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

### నీటి సరఫరా మెరుగుపర్చాలి

**శ్రీరాంపూర్:** సీసీసీ ఏరియాలో సింగరేణి నీటి సరఫరాను మెరుగుపర్చాలని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యంను డిమాండ్ చేశారు. క్వార్టర్లకు నీటి సరఫరా సక్రమంగా ఉండటం లేదన్నారు. మూడు, నాలుగురోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నారన్నారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పైపుల సమస్యలు ఉంటే వెంటనే మరమ్మతు చేసి సక్రమంగా తాగునీరందించాలని డిమాండ్ చేశారు.

### రాష్ట్ర, జిల్లా కార్యవర్గంలో చోటు

**దండేపల్లి:** పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా కార్యవర్గంలో దండేపల్లి మండలం లింగాపూర్ మోడల్‌స్కూల్‌లోని ఇద్దరు ఉపాధ్యాయులకు చోటు దక్కిందని పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇప్ప రవి, పానుగంటి లక్ష్మణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వల్లపు జయపాల్‌రెడ్డి రాష్ట్ర కార్యదర్శిగా, దాసరి రమేష్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

### ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం

**మంచిర్యాలఅర్బన్:** స్థానిక గోదావరి తీరంలో గౌతమేశ్వర ఆలయంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. తాటిపల్లి కవిత, రవికుమార్ పూజాసామగ్రి అందజేశారు. అన్నదానం నిర్వహించారు.

### స్నేహితుడికి ఆర్థిక చేయూత

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987–88 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు తోటి స్నేహితుడికి ఆపన్నహస్తం అందించారు. తమతో చదువుకున్న స్నేహితుడు పాయిలి రాజన్న ఓ వైపు పేదరికంతో, మరో వైపు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న తోటి స్నేహితులు, తలా ఓ చేయి వేసి ఆర్థిక చేయూత అందించారు. పాతమంచిర్యాలలో నివాసం ఉంటున్న రాజన్నకు సోమవారం రూ.51వేలు ఆర్థికసాయం చేసి కుటుంబానికి అండగా నిలిచారు.

### వేద పాఠశాలలో శ్రావణి ఉపాకర్మ


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

**తాండూర్:** మండలంలోని అచ్చలాపూర్ శ్రీ మహాదేవ వేద పాఠశాలలో సోమవారం శ్రావణి ఉపాకర్మ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా శ్రావణ పౌర్ణమి నాడు ఈ ఉపాకర్మ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా వేద పండితులు దుద్దిళ్ల మనోహర శర్మ, అప్పాల శ్యామ్ ప్రణీత్ శర్మ ఆధ్వర్యంలో నూతన యజ్ఞోపవీత ధారణ, ఉపాకర్మ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన యజ్ఞోపవీతాలను ధరించారు.

**యజ్ఞోపవీత ధారణ**

**దండేపల్లి:** రాఖీపౌర్ణమి (జంధ్యాల పూర్ణిమ) సందర్భంగా దండేపల్లి మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పద్మశాలీలు ఆలయ ఆవరణలో యజ్ఞోపవీత ధారణ చేసుకున్నారు.

### దండేపల్లి కస్తూర్బాలో వృక్షాబంధన్



**దండేపల్లి:** స్థానిక కస్తూర్బా పాఠశాలలో 'వృక్షా బంధన్' నిర్వహించారు. విద్యార్థులు రాఖీలు తయారు చేసి వాటిని, పాఠశాల ఆవరణలో నాటిన, పెంచుతున్న మొక్కలు, చెట్లకు కట్టారు. చెట్లను మనం రక్షిస్తే, అవి మనల్ని రక్షిస్తాయని విద్యార్థులు పేర్కొన్నారు.

### మతసామరస్యం చాటుతున్న యువతి



**నెన్నెల:** మండల కేంద్రంలోని వడ్లవాడకు చెందిన రేవెల్లి అంజలి అనే యువతి, ఇంటి పక్కనే ఉంటున్న సోదర సమానుడైన రహ్మాన్‌కు ఏటా రాఖీ కడుతోంది. ఈ సారి కూడా రాఖీ కట్టి మతసామరస్యాన్ని చాటుకుంది.

### మొక్కకు 'రక్షా'



**శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఏరియా హిమ్మత్‌నగర్‌కు చెందిన మమత, మల్లేశ్వరీ అనే ఇద్దరు అక్కా చెల్లెళ్లు రాఖీపౌర్ణమిని వినూత్నంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని వీరిరువురు పర్యావరణా ప్రాముఖ్యతను చాటుతూ తమ ఇంటి ఆవరణలో మొక్కను నాటి, దానికి రాఖీ కట్టి 'రక్షా బంధన్' నిర్వహించారు. మేము నీకు రక్షా.. ఎదిగాక నువ్ మాకు రక్షా అంటూ పచ్చదన ప్రాముఖ్యతను చాటిన ఈ అక్కా చెల్లెళ్లను కాలనీ వాసులు అభినందిస్తున్నారు.




# ఘనంగా రక్షాబంధన్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. అక్కా చెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపించారు. నీవు నాకు రక్షా, నేను నీకు రక్షా, ఒకరికి ఒకరం రక్షా అంటూ రాఖీ పండగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా రాఖీలు కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాఖీ కట్టిన సోదరీమణులకు సోదరులు కట్న కానుకలు, బహుమతులు అందజేసి సంతోషాలు పంచుకున్నారు. పండుగ సందర్భంగా పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. జన్నారం మండలంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సామూహిక 'రక్షాబంధన్' నిర్వహించారు. హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌లో గ్రామభారతీ ఆధ్వర్యంలో 'రక్షాబంధన్' నిర్వహించారు. మందమర్రిలో ఏరియా జీఎం ఆఫీస్‌లో జీఎం దేవేందర్‌కు మహిళా ఉద్యోగులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. చెన్నూర్ కస్తూర్బా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు తమ్ముళ్లు, అన్నలకు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 'రక్షా బంధన్' కార్యక్రమంలో రాఖీలు కట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజోద్దిన్‌కు చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా రాఖీ కట్టారు. బెల్లంపల్లిలోని ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ గృహ ప్రవేశం చేయగా కాంగ్రెస్ మహిళా శ్రేణులు తరలివచ్చి ఆప్యాయంగా ఎమ్మెల్యే చేతికి రాఖీ కట్టారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్‌కు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి అనురాగం పంచారు.

– సాక్షి నెట్‌వర్క్


చెన్నూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్‌కు రాఖీ కడుతున్న చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా


మందమర్రిరూరల్: ఏరియా జీఎంకు రాఖీ కడుతున్న మహిళా ఉద్యోగులు


నర్సింగాపూర్‌లో రాఖీ వేడుకల్లో గ్రామ భారతీ, ఉత్సవ సమితీ, బీజేపీ సభ్యులు


జన్నారం: ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రాఖీ కడుతున్న మహిళ


రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు


దండేపల్లి: అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లెలు


తాండూర్: అన్నయ్యకు రాఖీ కడుతున్న చిన్నారి


రాఖీ కడుతున్న సోదరి


చెన్నూర్‌రూరల్: కిష్టంపేటలో...


వేమనపల్లి: రాఖీ కడుతున్న చిన్నారులు


జైపూర్: సోదరుడికి రాఖీ కడుతున్న చెల్లెమ్మ


కోటపల్లి: రాఖీ కట్టి హారతి ఇస్తున్న అక్కాచెల్లెళ్లు


మందమర్రిరూరల్: రాఖీ కడుతున్న చెల్లెళ్లు

## బండి సంజయ్‌కు వినతుల వెల్లువ

**మంచిర్యాలరూరల్(హాజీపూర్)/వేమనపల్లి/బెల్లంపల్లి/మంచిర్యాలటౌన్:** మంచిర్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సోమవారం వేమనపల్లి మండల బీజేపీ నాయకులు కలిశారు. రోడ్డు మార్గాలకు అటవీ శాఖ అనుమతులు ఇప్పించే విధంగా చొరవ చూపాలని, వేమనపల్లి మండలంలో 40సంవత్సరాల నుంచి రైతులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలని, గిరిజనుల భూ సమస్యలపై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి రాఖీ కట్టారు. హాజీపూర్ మండల వైస్ ఎంపీపీ బేతు రవిరమాదేవితో పాటు పలువురు బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంచిర్యాల పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ స్థాపనను చేపట్టాలని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ సాధన సమితి సభ్యులు కోరారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ ఆటో కార్మికులు వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఆటో డ్రైవర్లు, ఓనర్ల పట్టణ కమిటీ, బీఎంఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బేతు రవికి కండువా కప్పుతున్న బండి సంజయ్

**'స్మార్ట్ హెల్మెట్' రూపకర్తకు అభినందన**

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** జిల్లా కేంద్రానికి చెందిన 10వ తరగతి చదువుతున్న వెన్నంపల్లి సిద్ధాంత్‌సాయి 'స్మార్ట్ హెల్మెట్' రూపొందించాడు. ఈ మేరకు సోమవారం హాజీపూర్ మండలంలోని రాంపూర్ శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి తాను తయారు చేసిన 'స్మార్ట్ హెల్మెట్'ను చూపించారు. 'స్మార్ట్ హెల్మెట్' పనితనాన్ని వివరించారు. హెల్మెట్ తలకు ధరిస్తేనే ద్విచక్ర వాహనం స్టార్ట్ అవుతుందని, లేనిపక్షంలో వాహనం స్టార్ట్ కాదని, స్మార్ట్ హెల్మెట్ వలన తలకు జరిగే ప్రమాదాల నివారణలో రక్షణగా ఉంటుందని మంత్రికి వివరించాడు. వాహనదారుడి భద్రతపై వినూత్నంగా స్మార్ట్ హెల్మెట్ రూపొందించడాన్ని మంత్రి బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు.



### గూడెంలో పౌర్ణమి జాతర

**దండేపల్లి:** జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం శ్రావణపౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. జిల్లాతో పాటు, ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. 188జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. గూడెం ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. భక్తులకు ఉచిత అన్నదానం చేశారు.

## పాత జ్ఞాపకాలకు సజీవ సాక్ష్యం 'ఫొటోగ్రఫీ'


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఫొటో గ్రాఫర్లు


తాండూర్:కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

**బెల్లంపల్లి:** పాత జ్ఞాపకాలకు ఫొటోగ్రఫీ సజీవ సాక్ష్యంగా నిలుస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఫొటో గ్రాఫర్లతో కలసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ ఓ అద్భుత ఆవిష్కృతమని ప్రశంసించారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, ఫొటోగ్రాఫర్లు కుంబాల రాజేష్, వేణు, శంకర్, చక్రధర్, విక్రమ్, సందీప్, ప్రసాద్, రాము, బాబన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

**కోటపల్లి:** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటపల్లి మండలకేంద్రంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు పడమటింటి రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో లాయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

**తాండూర్:** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని తాండూర్ మండల కేంద్రంలో సోమవారం మండల ఫొటో, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఫొటోగ్రఫీ ప్రస్థానం, ప్రస్తుతం ఫొటోగ్రఫీ ఆవశ్యకతపై అసోసియషన్ సభ్యులు చర్చించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు మేడిపల్లి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల శోభన్, ఉపాధ్యక్షుడు మోయిన్, గౌరవ అధ్యక్షుడు సమ్మన్న, సబ్బని శ్రీనివాస్, రజియోద్దీన్, మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కోటపల్లి: కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

### చిత్రం అనేక జ్ఞాపకాలను భద్రపరుస్తుంది

- జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్


అదనపు కలెక్టర్‌తో లయన్స్ క్లబ్ అధికారులు

**మంచిర్యాలఅగ్రికల్చర్:** ఒక్క చిత్రం మానవ జీవితంలో అనేక జ్ఞాపకాలను భద్రపరిచి గుర్తు చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ, లయన్స్ క్లబ్ హైటెక్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లు మంత్రి సునీల్‌కుమార్, మాదర బోయిన శ్రీనివాస్, టిక్కం సదానందంలను శాలువా, మెమొంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు రాకేష్‌రెడ్డి, విశ్వనాథ్, మధుసూదన్‌రెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి, చంద్రమౌళి, కొత్త సురేందర్, హనుమంతరావు, నాగేందర్ పాల్గొన్నారు.

### రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి


మాట్లాడుతున్న జీఎం దేవేందర్

**కాసిపేట:** అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు సమన్వయంతో పని చేసి ఎల్లప్పుడు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ సూచించారు. ఏరియాలోని కాసిపేట–2 ఇంక్‌లైన్ గనిని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో గనికి సంబంధించి మ్యాప్‌లు, ప్లాన్‌లను పరిశీలించారు. రోజువారీగా సాధిస్తున్న ఉత్పత్తి లక్ష్యాలను పెంచాల్సిందిగా అధికారులకు సూచించారు. మొదటిసారి గనికి వచ్చిన సందర్భంగా అధికారులు జీఎంకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, కేకే గ్రూపు ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ గని ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, నాయకులు , అధికారులు పాల్గొన్నారు.